క్లుప్తంగా

వివరాలు అందజేయండి

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులు తమ వివరాలు అందజేయాలని మండల వ్యవసాయాధికారి దీపిక కోరారు. రైతులు తమ భూముల పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు నంబరు, మొబైల్ నంబరు వివరాలు తమ వ్యవసాయ విస్తరణాధికారులకు అందచేయాలన్నారు. భూమి ఉన్న రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను అందచేస్తుందన్నారు. గురువారం పలువురు రైతుల నుంచి వివరాలు సేకరించినట్లు ఆమె చెప్పారు.

పాఠశాల ప్రారంభం

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రమైన అల్లాదుర్గం పట్టణం కాన్షీరాం నగర్ కాలనీలో రెండేళ్ల క్రితం మూతపడిన ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాధికారి ధనుంజయ ప్రారంభించారు. పాఠశాలలో 15 మంది విద్యార్థులను చేర్పించి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అయితే పాఠశాల మూతపడిన తర్వాత ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో మరో ఉపాధ్యాయుని నియమించలేదు. ప్రస్తుతం మరో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ వేసి పాఠశాలను ప్రారంభించారు.

వారాహి నవరాత్రి పూజలు

చేగుంట (తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మహంకాళి ఆలయంలో గురువారం వారాహి నవరాత్రి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారిని బాల వారాహి అలంకరణతో పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పరంజ్యోతి, శంకర్, సిద్ధిరాములు, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



పాపన్నపేటలోని ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ ప్రతాప్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): ప్రైవేట్ స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం పాపన్నపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బస్సులు ఫిట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బస్సు డ్రైవర్లు సుశిక్షితులై, మంచి కంటి చూపు కలిగి, లైసెన్స్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో సరైన పార్కింగ్ స్థలం ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన పాఠ్యపుస్తకాలనే వాడాలని, బడిలో వాటిని విక్రయించరాదని చెప్పారు. ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. సంబంధిత ధ్రువ పత్రాలను 10 రోజుల్లో ఎంఈఓల ద్వారా, డీఈఓ కార్యాలయానికి పంపించాలన్నారు.

రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక



పోటీలు నిర్వహిస్తున్న పూర్ణచందర్

కౌడిపల్లి(నర్సాపూర్): రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు వెల్మకన్నకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, వెల్మకన్న ఉన్నత పాఠశాల పీడీ పుర్ణచందర్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. నర్సాపూర్, వెల్మకన్నకు చెందిన 30 మంది పాల్గొనగా, వెల్మకన్నకు చెందిన ఆరాధ్య, కీర్తన, విఘ్నేశ్వరి, నిహారిక, సారిక, లాస్య, రాఘవేందర్, అభిలాష్, గణేశ్, మహేశ్ ప్రతిభ కనబర్చడంతో ఎంపికైనట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాకాలం కావడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలపై చర్చించారు. వీధి రోడ్లకు మరమ్మతులు, వీధి లైట్లు ఏర్పాటు, తదితర పనులపై తీర్మానం చేశారు. అలాగే తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణం కేంద్ర భవనం కోసం స్థల పరిశీలన చేశారు. అంతకు ముందు పీహెచ్‌సీ వైద్యురాలు ప్రియాంక మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా దోమల నివారణ చేయాలని, జ్వరం వచ్చినా.. ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చినా సెంటర్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ దీక్షిత్, గ్రామ కార్యదర్శి ప్రియాంక, ఏఎస్ఎం స్వర్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కదలని కార్గో సేవలు

- నెల రోజులుగా మూసివేత
- వినియోగదారులకు తప్పని తిప్పలు
- కొనసాగించాలని డిమాండ్

పెద్దశంకరంపేట(మెదక్): ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. జిల్లాలోని ఆయా ఆర్టీసీ బస్టాండ్‌ల పరిధిలో ఈ సేవలను ప్రారంభించారు. ఐదారేళ్లుగా పెద్దశంకరంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలను ఎంతో మంది వినియోగించుకుంటున్నారు. అయితే నెల రోజులుగా ఈ సేవలను నిలిపివేశారు.

వినియోగదారుల ఇబ్బందులు

మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తుంటారు. హైదరాబాద్, నిజామాబాద్, పిట్లం, నారాయణఖేడ్, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి నిత్యం ప్రైవేట్, ఆర్టీసీ ఆధ్వర్యంలో కొరియర్, ట్రాన్స్‌పోర్టు సేవలు జరుగుతుంటాయి. కిరాణా, వస్త్రవ్యాపారులు, ఎలక్ట్రికల్, వ్యవసాయ పంపుసెట్లు, సెంట్రింగ్, కలప, ఇతర వస్తు సామగ్రిని దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసేందుకు కార్గో సేవలను వినియోగిస్తుంటారు. ఈ సేవలపై ఆధారపడిన వారికి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో మూతపడిన కార్గో కార్యాలయం

ఖేడ్‌కు వెళ్లాల్సి వస్తోంది

కార్గో సేవలను నిలిపి వేయడంతో నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు వెళ్లి సామగ్రిని తీసుకురావాల్సి వస్తుండటంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసుకొని తెచ్చుకుంటున్నామని, ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని కార్గో సేవలను తిరిగి కొనసాగించాలని కోరుతున్నారు.

త్వరలోనే పునరుద్ధరిస్తాం..

బస్టాండ్‌లో కొరియర్ పార్శిల్– కార్గో సేవలను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కార్గో సేవలను తిరిగి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. ఇక్కడ కార్గో సెంటర్ నిర్వహణకు టెండర్‌లను పిలిచాం. త్వరలో ఏజెంట్‌ను నియమిస్తాం. ఏజెంట్‌లు ముందుకు రాకపోతే ఔట్‌సోర్సింగ్ ద్వారా సెంటర్ నిర్వహించేలా చర్యలు చేపడతాం.

– ఇసాఖ్, కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటలకు సస్యరక్షణ చర్యలు పాటిస్తే పైరు బాగుండటంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గంగారంలో నారుమడులను పరిశీలించి, సూక్ష్మపోషక లోపాలు ఉన్నాయన్నారు. 13–0–45 పది గ్రాములు, చిలేటెడ్ జింక్ గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆదేవిధంగా వరిలో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు నివారణకు, నారు తీయడానికి వారంరోజుల ముందు ఎకరానికి సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరన్ 3జీ గుళికలు, లేదా పిప్రోనిల్ 0.3, 600 గ్రాములు ఇసుకలో కలిపి చల్లి, పలుచగా నీటిని ఉంచాలన్నారు. వరిలో అగ్గితెగులు గమనిస్తే ట్రైసైక్లోజల్ 0.6 గ్రాములు, లేదా ఐసోప్రోథియాలోన్1.5 ఎంఎల్, లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పరిశీలించిన వారిలో ఏఈఓ కృష్ణవేణి, రైతు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలు చేసి.. మందులు అందించి

మెల్లూరులో ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ గ్రామంలో గురువారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్నవారికి ఉచితంగా మందులు ఇచ్చారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు భోజనం, ఇతర వసతులు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, రెహాన్, రోహన్, స్వాతి, సునీల్, మార్కెటింగ్ ఇన్‌చార్జి వెంకటాద్రి, సురేష్, రాఘవేంద్ర, నాగార్జున, దీక్ష, ఇజాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్

రేగోడ్(మెదక్): బదిలీలతో కూడిన ప్రమోషన్లను చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన రేగోడ్, టి.లింగంపల్లి, గజ్వాడ, జగిర్యాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్టీయూ శాఖలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టకపోతే సీనియర్లకు నష్టం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా పర్యవేక్షణ అధికారులుగా ఉపాధ్యాయులను నియమించొద్దని కోరారు. టీజీ జేఏసీతో కుదిరిన ఒప్పందం మేరకు పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు ప్రతీనెల రూ.700 కోట్లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు సందీప్, ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా బాధ్యులు అశోక్ రెడ్డి, కుమార్, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



సభ్యత్వ రశీదు ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

74 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు

జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ, ఫౌండేషన్ ప్రతినిధులు

తూప్రాన్: జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టేషనరీ వస్తువులను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సత్యనారాయణ, జీఎమ్మార్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయ్ కుమార్, చరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని పోతరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 74 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రిని పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందించడం అభినందనీయమని ఎంఈఓ సత్యనారాయణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి

పాపన్నపేట(మెదక్): పొడిచన్‌పల్లి వీఓఏ ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. గురువారం ఆమె సంఘం నాయకులతో కలసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వీఓఏ కుటుంబాన్ని పరామర్శించారు. పద్మ సూసైడ్ నోట్ ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిధుల గోల్‌మాల్‌లో బ్యాంకు అధికారులతో పాటు, ఏపీఎం, సీసీ ,ఇతర అధికారుల బాధ్యత ఉందన్నారు. కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సీఐటీయూ కార్యదర్శి మల్లేశం, వెంకట్,అశోక్, కృష్ణ ఉన్నారు.



మాట్లాడుతున్న బాలమణి

అర్హులకు సంక్షేమ ఫలాలు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజలు చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ పథకం ద్వారా నెరవేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాసు గుప్తా, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం విజయ్ యాదవ్, నరేష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆంజనేయులు, ఇతర నాయకులు

సర్కారీ విద్యను విధ్వంసం చేసే కుట్ర



కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆరోపణ
- నేడు ఇందిరాపార్కు వద్ద ధర్నా

తూప్రాన్: ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను నిరసిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శుక్రవారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నేతలు మాట్లాడుతూ.. నిర్బంధ ఉచిత పాఠశాల విద్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఒక విధంగా ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరం చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా టీపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముత్యాలు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి రమేష్ చారి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మండల కార్యదర్శి శ్రీనివాస్ జిల్లా కౌన్సిలర్ పరమేశ్వర చారి, కిష్టయ్య, పాల్గొన్నారు.

శ్రీ గురుపీఠంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలోని శ్రీ గురుపీఠంను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. దత్తాత్రేయస్వామి, సాయిబాబాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్‌కు తీర్థ, ప్రసాదాలు అందజేసి ఆలయ నిర్వాహకులు సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్యలక్ష్మి, భిక్షపతియాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, సుదర్శన్‌గౌడ్, గంగాధర్, రమేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, అశోక్, సత్యనారాయణగౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా ఎంఈఓ పట్టించుకోవడంలేదన్నారు. ఇష్టానుసారం ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. నిబంధనలు పాటించని, కనీస వసతులులేని పాఠశాలలను తనిఖీ చేసి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అంబాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బైండ్ల రాజ్‌కుమార్ నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీకి రాజ్‌కుమార్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, పాఠశాల హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయం

మెదక్ కలెక్టరేట్: కామారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుడిపై జరిగిన దాడి హేయమైన చర్యగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ అభివర్ణించారు. ఉపాధ్యాయుడిపై దాడిని ఆయన గురువారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావిస్తూ వారికి మంచి నడవడి, క్రమశిక్షణ నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వాటిని కూడా నిర్వర్తించనివ్వకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై దాడి చేస్తే రేపటితరం పిల్లల భవిష్యత్తు నాశనమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మత్తుతో చిత్తు కావొద్దు

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పోలీసులు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను వినియోగంచొద్దన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. పలు చోట్ల జడ్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి.. మాదక ద్రవ్యాలు వాడమని ప్రతిజ్ఞ చేశారు.



రామాయంపేటలో ర్యాలీ..



నర్సాపూర్ ర్యాలీలో పాల్గొన్న సీఐ, అధికారులు



పెద్దశంకరంపేటలో అవగాహన ర్యాలీ



వెల్దుర్తి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కౌడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



చేగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమలత



పాపన్నపేటలో..

బస్సు షెల్టర్‌కు మోక్షమెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

నిజాంపేట(మెదక్): ప్రధాన కూడల్లే బస్సు షెల్టర్‌గా ఉపయోగించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్ షెల్టర్ లేక బస్సులు వచ్చే వరకు రోడ్లపైనే నిలబడాల్సిన పరిస్థితి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు.

మండల పరిధిలోని 16 గ్రామాలకు గాను నిజాంపేట, నందిగామ గ్రామాలకు బస్సు సదుపాయం ఉంది. మండల కేంద్రానికి మాత్రమే ఎక్స్‌ప్రెస్ బస్సు స్టాప్ ఉంది. మిగిలిన 14 గ్రామాల ప్రజలు నిజాంపేట వచ్చి ప్రయాణం కొనసాగిస్తారు. నిత్యం మండలం నుంచి మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, కామారెడ్డి, కరీంనగర్‌కు వెళుతుంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో వర్షం పడినా, ఎండ కొట్టినా ప్రైవేట్ వ్యాపార సంస్థలు, హోటల్‌లో ఉండి బస్సు కోసం ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. రోడ్లపై బస్సులు ఆపడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. మండల కేంద్రంలో నూతన బస్టాప్, ఓల్డ్ బస్టాప్ రెండు ఉన్నాయి. ఇందులో నూతన బస్టాప్‌లో బస్సులు ఆపి, పాత బస్టాప్‌లో ఆపకుండా వెళ్తున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీకి కేటాయించిన స్థలం ఓల్డ్ బస్టాప్‌లో ఉన్న అక్కడ కూడా బస్సు ఆపడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నిజాంపేటలో ఆర్టీసీకి కేటాయించిన స్థలం

నిర్మాణం చేయలేదు

ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో యాజమాన్యం చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి వదిలేశారు. ఇక్కడ బస్టాప్ నిర్మాణం పూర్తి చేసినట్లయితే ఇబ్బందులు తప్పేవని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మౌలిక వసతులతో బస్టాప్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.